సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



జంతు నమూనాలతో పరిశోధన

మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనల్లో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. -8లో



గోవా, కర్ణాటక మద్యం స్వాధీనం

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గోవా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, కారు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	526
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,175.640 కిలోలు

న్యూస్‌రీల్

10న నవోదయ ప్రవేశపరీక్ష

మదనపల్లె సిటీ: మదనపల్లె జవహర్ నవోదయలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈనెల 10వతేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి 857 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 678 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ప్రవేశ పరీక్ష జవహర్ నవోదయ విద్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.

మసీదులో కలెక్టర్ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీలు

రాయచోటి: రాయచోటి ఠాణా సర్కిల్‌లోని పెద్ద జామియా మసీదును మంగళవారం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాషాలతో కలిసి సందర్శించారు. మసీదు ఆవరణలోకి వచ్చిన కలెక్టర్, జేసీలకు మసీదు మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మసీదు చరిత్రను వారికి వివరించారు. అనంతరం కలెక్టర్, జేసీ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

బైజ్యూస్ ట్యాబ్‌ల ద్వారా పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ ట్యాబుల ద్వారా మంగళవారం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మదనపల్లె, చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ పరీక్షలను ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పెషల్ కలెక్టర్‌గా కౌసర్‌భాను



కడప సెవెన్‌రోడ్స్: కడప గాలేరు–నగరి భూ సేకరణ విభాగం–2 ఎస్‌డీసీగా పనిచేస్తున్న ఖతీబ్ కౌసర్‌భానును ప్రభుత్వం గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. ఇందుకు సంబంధించిన జీఓ ఆర్‌టీ నెంబరు 284 ఉత్తర్వులు చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం జారీ చేశారు. కౌసర్‌భాను అక్టోబరులో ఎస్‌డీసీగా జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారిగా కొంతకాలం పనిచేశారు. అనంతరం ఎస్‌డీసీగా కొనసాగేవారు. ప్రస్తుతం ఆమెను స్పెషల్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

వైఎస్‌ఆర్ జిల్లా డీఈఓకు ఆర్‌జేడీగా పదోన్నతి



రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా డీఈఓగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డికి ప్రభుత్వం పాఠశాల విద్య ఆర్‌జేడీగా పదో న్నతి కల్పించింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులను జారీ అయ్యాయి. ఈయన 2023 మార్చి 7వ తేదీ నుంచి డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన నేడో, రేపో కడప ఆర్‌జేడీ కార్యాలయంలో పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

వైఎస్సార్ జిల్లా డీఈఓగా అనూరాధ

వైఎస్సార్ జిల్లా డీఈఓ పోస్టుకు నంద్యాల డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న అనురాధకు డీఈఓగా పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. ఆమె కూడా నేడో, రేపో బాధ్యతను చేపట్టనున్నారు.

చిత్తూరు డీఈఓగా కడప ఏడీ దేవరాజు

కడప డీఈఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజన ఏడీగా పనిచేస్తున్న దేవరాజుకు చిత్తూరు జిల్లా డీఈఓగా పదోన్నతి లభించింది.

అన్నమయ్య ఏడీ వరలక్ష్మికి అనంతపురం డీఈఓగా పదోన్నతి...


అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఏడీ వరలక్ష్మికి కూడా డీఈఓగా పదోన్నతి లభించింది.ఆమెకు అనంతపురం డీఈఓ పోస్టింగ్ ఇచ్చారు.

పెళ్లి సందడికి వేళాయె

- 11 నుంచి మాఘమాసం ప్రారంభం
- ఏప్రిల్ 26 వరకూ వివాహాల కోలాహలం
- 3 నెలల్లో 30 ముహూర్తాలు



సిద్ధమైన వివాహ వేదిక



పూల డెకరేషన్

మదనపల్లె సిటీ: వేదమంత్రాల సాక్షిగా జీవితాన్ని పండించుకునేందుకు కొంగులు ముడివేసుకోనున్నాయి. మాఘమాసం ప్రారంభం కానుండటంతో పెళ్లి సందడి నెలకొంది. పట్టణాలతో పాటు గ్రామాల్లో సన్నాయి మేళాలు మెగనున్నాయి. ఈనెల 11 నుంచి మాఘ మాసం ప్రారంభమవుతుంది. ఈనెల 13 నుంచి ఏప్రిల్ 16 వరకు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి.

- సుమారు రెండు నెలల విరామం అనంతరం వివాహాలు ప్రారంభంకానున్నాయి. రెండు కుటుంబాల మధ్య అనుబంధాలు పెనవేసుకునే ఘట్టం రానే వచ్చింది. శుభ ముహూర్తాలు అధికంగా ఉండటంతో పెళ్లిళ్ల జోరందుకోనున్నాయి. వేలాది జంటలు ఒక్కటవుతున్నాయి.
- పెళ్లి శుభలేఖలు, కల్యాణ మండపాలకు అలంకరణలు, కొత్త దుస్తుల కొనుగోళ్లతో షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు అన్ని మండల కేంద్రాల్లో పెళ్లిళ్ల వాతావరణం కనిపిస్తోంది.



పట్టు చీరలు, బంగారం కీలకం

పెళ్లిళ్లలోల ప్రధాన మైదనది పట్టుచీరలు, బంగారం. తాళిబొట్టు నుంచి నిలువెత్తు వరకు స్థాయిని బట్టి బంగారాన్ని వాడుతుంటారు. బంగారం ఖరీదు పెరుగుతున్నా వ్యాపారం మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో ప్రధానంగా మదనపల్లె, రాయచోటిలోని బంగారు దుకాణాల్లో కొనుగోలు సందడి నెలకొంది. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో పట్టుచీరల కొనుగోలు ఊపందుకుంది.

మేకప్ నుంచి బాజా భజంత్రీల వరకు..

పెళ్లంటేనే ఓ సందడి. నోరూరించే వంటలు, మేకప్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, పురోహితులు, బాజాభజంత్రీలతో పాటు ఇలా ఎన్నో వర్గాల వారికి ప్రత్యక్షంగా,పరోక్షంగా చేతి నిండా పని దొరికుతుంది. కల్యాణమండపాలు నచ్చి నట్లు పూలతో డెకరేషన్స్ చేయిస్తున్నారు.

ముహూర్తాలు తక్కువే

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మాఘ మాసం ప్రారంభమవుతున్న ఈనెల 11 నుంచి క్రోధినామ సంవత్సర చైత్రమాసం వరకు అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకు మూడు నెలల్లో కేవలం 30 ముహూర్తాలు మాత్రమే ఉన్నాయి. ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. దీంతో వైఖాఖం, జ్యేష్ఠమాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని ప్రముఖ పంచాంగకర్త శివకుమార్‌శర్మ తెలిపారు. తరువాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికిరాదు. మళ్లీ శ్రావణమాసం అంటే ఆగస్టు నుంచి వివాహాలు జరుగుతాయని శివకుమార్‌శర్మ తెలిపారు.

వివాహ ముహూర్తాలు



మాఘం: ఫిబ్రవరి 13,14,17,18,24,28,29, మార్చి 2,3 తేదీలు
ఫాల్గుణం:మార్చి15,17,20,22,24,25,27,28,30 ఏప్రిల్ 3,4
చైత్రం: ఏప్రిల్ 9, 18,19,20,21,22,24,26
ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం.

ఎక్కువ వివాహాలు జరుగుతాయి



ఈ ఏడాది వివిధ కారణాల వల్ల వివాహ ముహూర్తాలు తక్కువగా ఉన్నాయి. ఫిబ్రవరి 13 నుంచి ఏప్రిల్ 26 వరకు ముహూర్తాలున్నందున వివాహాలు ఎక్కువగానే జరిగే అవకాశం ఉంది. –సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె

ముందుగానే బుక్ చేసుకున్నారు



పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో కల్యాణ మండపాలు ముందుగానే బుక్ అవుతున్నాయి. ముహూర్తాలు కేవలం 30 ఉండటంతో అన్నింటికీ డిమాండ్ ఏర్పడింది. పెళ్లి మండపాలు డెకరేషన్, కేటరింగ్‌లకు ముందుగానే అడ్వాన్సులు ఇస్తున్నారు. –బాలగంగాధర్‌రెడ్డి, శ్రీవారి సప్లయర్స్,మదనపల్లె

నచ్చిన రీతిలో డెకరేషన్



కల్యాణ మండపాల నుంచి స్వాగత తోరణాల వరకు నచ్చిన రీతిలో డెకరేషన్ చేస్తున్నాం. ముహూర్తాలకు రోజులు దగ్గర పడటంతో బెంగళూరు, కడప, తమిళనాడు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పూలు,డెకరేషన్ సామగ్రి ముందుగా తెచ్చుకుంటున్నాం. –ఎంబీఎస్ బాషా, పూల వ్యాపారి, మదనపల్లె

ఏ రోజు మార్కులు ఆ రోజే నమోదు చేయాలి

- ఇంటర్ ఆర్‌ఐవో, డీవీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఏ రోజు నిర్వహించిన సబ్జెక్టును అదే రోజు వాల్యుయేషన్ చేసి వచ్చిన మార్కులను ఆదే రోజు ఉదయం, సాయంత్రం మార్కులను బోర్డుకు సంబంధించి సైట్‌లో ఆప్‌లోడ్ చేయాలని ఇంటర్ ఆర్‌ఐవో బండి వెంకటసుబ్బయ్య, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో మంగళవారం ప్రాక్టికల్ పరీక్ష మార్కులను ఆన్‌లైన్ చేసే విధానంపై ఆయా సబ్జెక్టు అధ్యాపకులకు డెమో నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ప్రాక్టికల్ పరీక్షల మార్కులను ఓఎంఆర్ షీట్‌లో వేసి బోర్డుకు పంపించేవారన్నారు. కానీ ఈ ఏడాది నుంచి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ప్రతి సబ్జెక్టు లెక్చరర్ ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షను ఉదయమే వ్యాల్యుయేషన్ చేసి ఆదే రోజు ఉదయం 12 నుంచి 2 గంటలలోపు, మధ్యాహ్నం తర్వాత నిర్వహించిన పరీక్ష మార్కులను సాయంత్రం 5 నుంచి 7 గంటల లోపు బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంలో అజాగ్రత్తగా ఉంటే వెబ్‌సైట్ క్లోజ్ అవుతుందని, తర్వాత మార్కులను అప్లోడ్ చేయడం కుదరదన్నారు. ఈ విషయాన్ని అధ్యాపకులు గమనించాలని తెలిపారు. డీఈసీ సభ్యులు మాట్లాడుతూ బోర్డు ఆదేశాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇందులో ఎవరు కూడా నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్ రావు

ప్రొద్దుటూరు: ఏపీ పీటీడీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎంప్లాయిస్ యూనియన్ పనిచేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరులోని బీజీఆర్ కల్యాణ మండపంలో ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు డి.గోపాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రావు మాట్లాడుతూ 2017 నుంచి 2020 వరకు ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ బకాయిలను ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా మేనేజ్ మెంట్ చెల్లించలేదన్నారు. ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టులలో పొదుపు చేసుకున్న బకాయిలను వెంటనే అందరికి చెల్లించాలని డిమాండ్ చేవారు. కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, రాజశేఖర్ మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో గౌరవాధ్యక్షుడిగా డి.గోపాల్, డిపో అధ్యక్షుడిగా పి.వెంకటేశ్వర్లు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బీసీ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.సుధాకర్‌రెడ్డి, డిపో కార్యదర్శిగా వి.రఘునాథరెడ్డి, గ్యారేజి సెక్రటరీగా ఎస్.మక్బుల్ బాషా, ట్రెజరర్ జి.గంగాధర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, రామమూర్తి, ఏపీజేఏసీ అమరావతి మహిళా కమిటీ జిల్లా ప్రదాన కార్యదర్శి బి.పద్మావతి, అసిస్టెంట్ సెక్రటరీ శాంత కుమారి, జోనల్ నాయకులు నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, రామలింగారెడ్డి, రీజనల్ నాయకులు ప్రతాప్ రెడ్డి, డిపో నాయకులు రమణ, ఎస్‌ఎస్‌కే రెడ్డి, ఏఎస్ వాసులు, కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చక్రం.. ప్రజల నేస్తం

- ఆర్టీసీ బస్సులను ఆదరిస్తున్న ప్రయాణికులు
- పెరిగిన ఆదాయం



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు మరోవైపు ప్రయాణికులపై అదనపు భారం పడకుండా సాధారణ చార్జీలతోనే ప్రయాణం చేసేలా వీలు కల్పించారు. గత టీడీపీ హయాంలో పెద్ద పండుగలు, విశిష్ట రోజుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయగా, వైఎస్ జగన్ సర్కార్ ఆయా సర్వీసుల్లో కూడా సాధారణ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో స్థానికంగా తిరగడానికి.. సుదూర ప్రయాణాలకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులతో పోలిస్తే ఆర్టీసీ ఛార్జీలు తక్కువగా ఉండడంతో ప్రజల ఆదరణ పొందింది. అంతేకాకుండా ప్రతి ఏటా సంక్రాంతి, దసరా, కార్తీకమాసం, మహాశివరాత్రి, ఇతర తీర్థ యాత్రలకు ప్రత్యేక సర్వీసులను నడుపుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రతినెల తిరువన్నామలైకి నడుపుతున్న సర్వీసులకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అంతేకాకుండా ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక విప్లవాన్ని దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ల కొనుగోలులో నగదు రహిత లావాదేవీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దాదాపు అన్ని బస్సుల్లో ఫోన్ పే, గుగూల్ పే, పేటీఎం అందుబాటులోకి తీసుకురావడం మరింత సౌకర్యవంతంగా మారింది.

- తమిళనాడులోని తిరువన్నామలైకి కడప రీజియన్ పరిధిలో 2022వ సంవత్సరం నవంబరు 30వ తేదీన సర్వీసును ప్రారంభించారు.ఇప్పటివరకు 171 సర్వీసులను 125851 కిలోమీటర్ల నడపడం ద్వారా రూ. 75,36,628 ఆదాయం ఒనగూరింది.

నాలుగేళ్లలో రూ. 5 కోట్లకుపైగా రాబడి

కడప రీజియన్ పరిధిలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల డిపోల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా నాలుగేళ్లలో రూ. 5,40,94,672 రాబడి వచ్చింది.


- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు నూతనోత్సాహంతో సంస్థ ఆదాయం పెంపునకు శ్రమిస్తున్నారు.
- చంద్రబాబు హయాంలో ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. అప్పట్లో కార్పొరేషన్ సంస్థగానే చూసి సక్రమంగా నిధులు విడుదల చేయలేదు. వందలాది బస్సులను పోలవరం ప్రాజెక్టు వద్దకు.. తన ప్రచార సభలకు ఉచితంగా ఉపయోగించుకుని ఆర్టీసీకి బకాయిలు పెట్టారు. దీంతో బాబు పాలనలో నష్టాలే తప్ప లాభాలు రాలేదు.

గత నాలుగేళ్లలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ద్వారా వచ్చిన ఆదాయం

సంవత్సరం	వచ్చిన ఆదాయం
2019–20	1,23,89,393
2020–21	1,28,28,757
2021–22	42,61,966
2022–23	1,03,93,917
2023–24	1,42,20,639

ఎవరిగోల వారిదే..!

- ప్రొద్దుటూరు టీడీపీలో గందరగోళం
- ప్రవీణ్‌కు అండగా నిలుస్తున్న వాసు
- వరదకు మోకాలొడ్డుతున్న మల్లెల
- తెరచాటు మంత్రాంగం నిర్వహిస్తున్న పొట్లదుర్తి బ్రదర్స్



సాక్షి ప్రతినిధి, కడప: ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీలో గందరగోళం నెలకొంది. తెలుగుతమ్ముళ్లు తలోదారిలో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు క్రమం తప్పకుండా ఒకరి తర్వాత మరొకరు తెరపైకి వస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరికి వారు అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. అది చాలదన్నట్లు జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి మైండ్‌గేమ్ ఆడుతున్నారు. అధిష్టానం ఎలాంటి ప్రకటన చేయకముందే అభ్యర్థిగా పోస్టర్లు ఒకరు వేయిస్తే, టికెట్ మనదే, పోటీలో ఉండేది మనమే అంటూ మరొకరు వారి వారి నెట్‌వర్క్ ద్వారా ప్రచారపర్వాన్ని అందుకుంటున్నారు.

'అలు లేదు.. చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం'అన్నట్లుగా ప్రొద్దుటూరు తెలుగుతమ్ముళ్ల పరిస్థితి నెలకొంది. ఓ వైపు టీడీపీ సొంతంగా పోటీ చేసే పరిస్థితి లేకపోగా, పొత్తుల సమీకరణ పనిలో అధినేత చంద్రబాబు నిమగ్నమయ్యారు. అధినేత ఆ పరిస్థితిలో ఉంటే నాయకులు ప్రొద్దుటూరులో టికెట్ తమదేనని ఎవరికి వారు తెరపైకి వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డి, ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఇప్పటికే ప్రచారంలో నిమగ్నం కాగా, సోదరులమంతా అధినేతను కలిశాం. తుది జాబితాలో తానే ఉంటానంటూ సురేష్‌నాయుడు తెరచాటు మంత్రాంగం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో సీనియర్ నేత వరదరాజులరెడ్డితో వైరం లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

వరదపై మల్లెల మండిపాటు

ఈమారు ఎన్నికల్లో తాను లేదా తన కుమారుడు కొండారెడ్డి పోటీలో ఉంటామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకునే అర్హత వరదరాజులరెడ్డికి లేదని జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి విమర్శిస్తున్నారు. సభ్యత్వమే లేని వరద ఎలా ప్రచారం చేస్తారని మండిపడుతున్నారు. జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి మాటలు నిజమే అయితే, అధినేత చంద్రబాబు వద్దకెళ్లి వరద కుటుంబాన్ని పార్టీ నుంచి బహిష్కరించే చర్యలు చేపట్టవచ్చు కదా...అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానం లేకపోయినా నోరెత్తని లింగారెడ్డి, ఉనికి కోసం ఆరాట పడుతున్నారని వరద వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇలా ఎవరికి వారు ప్రచారం చేసుకుంటుండటంతో ప్రొద్దుటూరు తెలుగుదేశంలో గందరగోళం నెలకొంది. తలోదిక్కుగా తెలుగుతమ్ముళ్లు వ్యవహరిస్తుండటం విశేషం.

ప్రవీణ్‌కు వాసు వత్తాసు

పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వత్తాసుగా నిలుస్తున్నారు. ఆయన చర్యలే అందుకు దర్పణంగా నిలుస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేరుతో ప్రొద్దుటూరులో పోస్టర్లు వెలిశాయి. నలుగురు ఆశావహులు ఉండటం, అధిష్టానం ప్రకటనతో నిమిత్తం లేకుండా రాత్రికి రాత్రి వాల్ పోస్టర్లు తెరపైకి రావడంతో తక్కిన వారు జీర్ణించుకోలేని పరిస్థితి తలెత్తింది. తాజాగా శ్రీనివాసులరెడ్డి ఏడాది క్రితమే నారా లోకేష్, ప్రవీణ్ నాయకత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తేల్చి చెప్పారు. తాను సైతం పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. రామేశ్వరం రోడ్డులో టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పుకొచ్చారు. కాగా, ఆకార్యక్రమానికి స్థానికంగా నివాసం ఉంటున్న జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డిని ఆహ్వానించకపోవడం గమనార్హం. ఇన్‌చార్జి ప్రవీణ్ చర్యలకు వత్తాసుగా నిల్చే విధంగా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి చర్యలున్నాయని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు

రాయచోటి టౌన్: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి విద్యుత్ డివిజనల్ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని చెప్పారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడైనా కాలిపోతే వెంటనే పునరుద్ధరించాలని చెప్పారు. అనంతరం సంబేపల్లె మండలం దేవపట్లలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై. చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ చాంద్‌బాషా, విజయకుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అకౌంట్ ఆఫీసర్ పాపయ్య, కమర్షియల్ ఏఈ నరేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రెడ్డప్ప నాయుడు కాలనీకి చెందిన రామిరెడ్డి కుమారుడు సి.ముని శంకర్ రెడ్డి (65) సీటీఎం రోడ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం అతన్ని ఢీకొంది. ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

'మా ఆస్తిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారు'


ఆధారాలు చూపుతున్న బాధితుడు అర్షద్ అహమ్మద్

రాయచోటి టౌన్ : తమ తండ్రి నుంచి రావాల్సిన ఆస్తిని తమకు తెలియకుండా అబూబకర్, ఖాదర్‌బాషా అనే వ్యక్తులు వారి పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారని బాధితుడు అర్షద్ అహమ్మద్ పేర్కొన్నాడు. దీనిపై మంగళవారం ఆర్‌డీఓ, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడిక కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం గున్నికుంట్ల రోడ్డులో సర్వే నంబర్ 800లో 75 సెంట్ల భూమి ఉందని చెప్పారు. ఈ భూమికి సంబంధించి 30 సంవత్సరాలు అడంగల్, ఆర్‌ఎస్‌ఆర్, 1బి. 10 వన్‌లో కూడా తన తండ్రి పేరు సులేమాన్ పేరుతో ఉన్నాయన్నారు. గతంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన పరిశీలించి తన తండ్రికి చెందినదేనని ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. అయినా ఇంత వరకు తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జంతు నమూనాలతో పరిశోధనలు

- 3 ఆర్ విధానాన్ని పరిశోధకులు అవలంబించాలి
- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్
- మానవవ్యాధుల అధ్యయనంపై రెండు రోజుల సెమినార్ ప్రారంభం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరిశోధకులు

వైవీయూ : మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనల్లో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. వైవీయూలో «మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు.. నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు» అన్న అంశంపై మంగళవారం రెండురోజుల సెమినార్ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అధ్యక్షతన వైవీయూలోని తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్లో జరిగిన ఈ సెమినార్‌కు వైస్ చాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జంతువులను ఉపయోగించేటప్పుడు 3 ఆర్ (రీప్లేస్‌మెంట్, తగ్గింపు, శుద్ధీకరణ) వ్యూహాన్ని వినియోగించాలన్నారు. గత కొన్నేళ్లుగా క్లినికల్, బయోమెడికల్ పరిశోధనలో జంతు పరీక్ష నమూనాలను భర్తీ చేసేందుకు అనేక ప్రత్యామ్నాయ పద్ధతులు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సెల్-ఆధారిత పరీక్షలు, మైక్రోఫ్లూయిడ్ చిప్స్, కణజాల నమూనాలు, కంప్యూటర్ నమూనాలు, మానవ శరీర దాతలు, మానవ కణం, కణజాల-ఆధారిత పరీక్షల ద్వారా పరిశోధనలు చేయవచ్చన్నారు. 20 ఏళ్ల కిందటే ఇంటర్మీడియట్ విద్యలో ప్రయోగాల కోసం జంతువుల వినియోగాన్ని నిషేధించారని గుర్తుచేశారు. జంతువులకు బదులుగా, ఈ మానవ-ఆధారిత నమూనాలను జీవ, వ్యాధి ప్రక్రియలు, ఔషధ జీవక్రియలను అధ్యయనం చేయడానికి ఉపయోగించవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పరిశోధకులు జంతువులను మనుషుల్లా చూడాలని కోరారు. ప్రత్యామ్నాయ విధానాల ద్వారా పరిశోధనలు ముందుకెళ్లాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ జంతువుల సంరక్షణ చట్టాలను హక్కులు, పరిశోధనల పేరుతో నష్టం కలిగిస్తున్నామని, 60 శాతం జంతువులు, జీవ, వైద్య ప్రయోగాల్లో వినియోగిస్తున్నారని తెలిపారు. సెమినార్ కన్వీనర్, జువాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల సదస్సుకు దేశంలోని పరిశోధకుల నుచి 80 పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. మానవులకు, సమాజానికి మేలు చేసే జంతువులు పరిశోధనల పేరుతో వాటికి నష్టం కలిగించడం సరికాదన్నారు. పరిశోధన ,బోధనలో జంతువుల వినియోగంపై ప్రపంచం అంతటా కఠినమైన నిబంధనలు ఉన్నాయన్నారు. భారతదేశం నైతిక విలువలకు లోబడే జంతు సంరక్షణ చట్టాలను అమలు చేస్తోందన్నారు. వైవీయూ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ జంతురాజ్యం దెబ్బతింటే ఆహార గొలుసులో తేడాలు ఎదురై ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసర్ వి.హెచ్.రావు కీలక ఉపన్యాసం చేస్తూ జంతు ప్రయోగాలకు ప్రత్యామ్నాయ పద్ధతులను కనుగొని అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. శాంతిభట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్ సీడీఎఫ్‌డీ గ్రూప్ లీడర్ డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ జంతువులకు ప్రత్యామ్నాయంగా బ్యాక్టీరియా, సక్కరోమైసిస్ , డ్రోసోఫిలా, జీబ్రా ఫిష్, సి.ఎలిగన్స్ వంటి బ్యాక్టీరియా, నెమటోడ్, చేపలను వినియోగించవచ్చన్నారు. వాటి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నివారించే మందులు తయారవుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ జె. జగన్‌మోహన్ రెడ్డి ఇన్విట్రో ప్రత్యామ్నాయాలపై మాట్లాడారు. రేవా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పసుపులేటి విశ్వేశ్వరరావు జీవక్రియ వ్యాధుల కోసం జంతు నమూనాలు, ఊటీ జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ టి.కె. ప్రవీణ్ జంతు ప్రయోగాల చరిత్ర ప్రత్యామ్నాయాలపై ప్రసంగించారు. ఈ సదస్సులో సెమినార్ నిర్వహణ సంఘం సభ్యులు డాక్టర్ ఎస్. పి.వెంకట రమణ, డాక్టర్ వి. అనుప్రసన్న, డాక్టర్ ఎ.టి. వెంకటరమణారెడ్డి, డాక్టర్ ఎ.ఎస్. పి. మరియదాస్, బి. మనస్వి , పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవశకం

అమ్మఒడి వరం లాంటిది



మేము బద్వేలు పట్టణంలోని 7వ వార్డులో గల బెస్తవీధిలో నివాసముంటున్నాము. నా భర్త సురేష్ పెయింటింగ్ పని చేస్తారు నా కుమార్తె స్వాతి క్రిష్ణవేణి ఇంగ్లీషు మీడియం స్కూల్ 7వ తరగతి చదువుతోంది. గతంలో పాప చదువుకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగు తదితరాలకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక ప్రతి ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలు సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. అలాగే గతంలో కంటే బడి రూపురేఖలు కూడా బాగుపడ్డాయి. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో బడిని మార్చేశారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పాపకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే అందజేశారు.

– జి.స్వాతి, బెస్తవీధి, బద్వేలు

సొంతింటి కల నెరవేరింది



సొంతింటి కల నెరవేరిందని మండల పరిధిలోని రామక్కపల్లికి చెందిన పోలి చెంగల్ రెడ్డి ఆనందంగా ఉంది. నిరుపేదలమైన మేము గతంలో ఇల్లులేక అనేక అవస్థలు పడ్డాము. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మాకు స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రభుత్వం అందించిన నగదు, సిమెంట్, ఇసుక, కడ్డీలు తదితర సామగ్రితోపాటు మా రెక్కల కష్టాన్ని తోడు చేయడంతో ఇల్లు బాగా కట్టుకున్నాము. మాకు అమ్మఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు ప్రభుత్వం అందిస్తోంది. మా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన ఆహారంతో పాటు కార్పొరేట్ విద్యను అందించడం చాలా గొప్ప విషయం. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అయితే నాలాంటి నిరుపేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. పిల్లలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు.

– పోలి చెంగల్ రెడ్డి, రామక్కపల్లి, అన్నమయ్య జిల్లా

వేర్వేరు ప్రాంతాల్లో పలువురి ఆత్మహత్యాయత్నం


చేయి కోసుకున్న లలితమ్మ.


ఉరి వేసుకున్న షబానా అలియాస్ సంధ్య

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో పలువురు మహిళలు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

చేయి కోసుకుని..

తన భర్త మొదటి భార్య సంతానానికి ఆస్తి ఇచ్చేశాడని మనస్తాపంతో వివాహిత చేయి కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. అనపగుట్టకు చెందిన ఆర్.సాయికుమార్, ఆర్.లలితమ్మ దంపతులు. సాయి కుమార్ మొదటి భార్య లక్ష్మీదేవి చనిపోవడంతో లలితమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. ఆమె చేనేత కార్మికురాలుగా పనిచేస్తుంది ఆమెకు కూతురు ఉంది. అయితే భర్త సాయికుమార్ ఇటీవల తన మొదటి భార్య సంతానానికి కొంత ఆస్తిని ఇచ్చాడు. ఈ విషయమై భర్తతో ఆమె గొడవ పడింది. మనస్తాపంతో చేయి కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

పక్కింటి వారు తిట్టారని..

పక్కింటి వారు తనతో గొడవపడి అసభ్యంగా తిట్టారన్న మనస్తాపంతో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని నక్కలదిన్నెలో జరిగింది. నాగన్న భార్య షబానా అలియాస్ సంధ్య (36), తో పక్కింటి వారు మంగళవారం గొడవపడ్డారు. ఆ క్రమంలో ఆమెను విచక్షణ రహితంగా తిట్టారు. దీంతో సంధ్య మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేశారు.

ప్రేయసికి పెళ్లయిందని..

కురబలకోట : తాను ప్రేమించిన యువతికి వేరొకరితో పెళ్లి జరగడంతో మనస్థాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు..అంగళ్లకు చెందిన సాయికిశోర్ (26) అదే ఊరికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. ఆమెకు ఇటీవల మరొకరితో పెళ్లయింది. మనస్తాపం చెందిన సాయి కిశోర్ విషద్రావణం తాగాడు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ సమస్యలతో మరో నలుగురు

మదనపల్లె: బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ దబ్బాలవారిపల్లికి చెందిన సిద్దప్ప కుమారుడు దబ్బల వెంకటరమణ (35), కుటుంబ సమస్యల కారణంగా మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కురబలకోటకు చెందిన షుకూర్ భార్య మదీనా (25) కుటుంబ సమస్యలతో సోమవారం రాత్రి నిద్ర మాత్రలు మింగింది. అంగళ్లు గ్రామంలోని కదిరి రోడ్‌లో నివాసమున్న వెంకటరమణ కుమారుడు కె.సాయి కిషోర్ (26) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగాడు. మదనపల్లె పట్టణం దిగువ కురవంకకు చెందిన జనార్దన్ భార్య సి.శిరీష (35) నిద్ర మాత్రలు మింగి సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనలో బాధితులను 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదమాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని బసిన కొండ గ్రామ సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎం.ఆదినారాయణ (39) ఎం.కనకరాజు (28) బి.విజయ్ కుమార్ (27) ఏ.గంగరాజు (26) బి.సుబ్రహ్మణ్యం (39) లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి


మృతుడు రామాంజులు

కేవీపల్లె : గ్యారంపల్లె పంచాయతీ కురవపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి చెందాడు.. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మహల్‌రాజుపల్లెకు చెందిన రామాంజులు (36) తీతవగుంటపల్లె గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి రామాంజులు తోపాటు సర్వేయర్ నాగేంద్ర సొంత పనుల నిమిత్తం పీలేరుకు వెళ్లారు. అక్కడి నుంచి అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. కురవపల్లె వద్ద ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ రామాంజులు మృతి చెందాడు.

వివాహిత అదృశ్యం పై కేసు నమోదు


అనిత (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. మండలంలోని చీకటిబైలుకు చెందిన వేమన్న, నరసమ్మ దంపతుల కుమార్తె పి.అనిత (30)ను చిత్తూరు జిల్లా కల్లూరు మండలం దిగువ ముత్యవారిపల్లెలో నివాసమున్న నరసింహకు ఇచ్చి వివాహం చేశారు. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడిన కారణంగా అనిత గత ఆరు నెలలుగా పుట్టిల్లు అయిన చీకటిబైలులో ఉంటోంది. ఈ క్రమంలో గత నెల 18వ తేదీన అత్తవారిల్లయిన దిగువ ముత్యవారిపల్లెకు వెళ్తానంటూ ఇంటి నుంచి వెళ్లింది. అయితే ఆమె భర్త వద్దకు వెళ్లకపోవడం తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లోనూ బంధువుల ఇళ్లల్లోనూ వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో తల్లి నరసమ్మ ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మృతికి కారణమైన నిందితుల అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి

ఓబులవారిపల్లె : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందడానికి కారణమైన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 3వ తేదీ కొర్లకుంట చెరువు సమీపంలోని రెడ్డికాలువ వద్ద విద్యుత్‌షాక్‌తో తుపాకుల సుబ్రమణ్యం (35) మృతి చెందిన విషయం విదితమే. అతని మృతికి కారణమైన నారాయణ రాజుపోడు ఎస్టీ కాలనీకి చెందిన వి.సుధాకర్, వి.లక్ష్మయ్య, వి.రామయ్య, వెలుగు గంగాధర్‌లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. నలుగురు నిందితులు అడవి పందుల కోసం విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారని, వాటిని గమనించకుండా చేపల వేటకు వెళ్లిన సుబ్రమణ్యం విద్యుత్ తీగలను తగిలి మృతి చెందాడని తెలిపారు. మృతికి కారణమైన నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ చిన్న పెద్దయ్య, సిబ్బంది నరసింహ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 5. 85 లక్షలకు తలనీలాల వేలం పాట


సిద్ధవటంలోని శ్రీరంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేల పాటను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను సిద్దవటం గ్రామానికి చెందిన కూనా విజయభాస్కర్ రూ. 5.85 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో మార్చి 7వ తేదీ నుంచి మార్చి 9 తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తులు స్వామివారికి సమర్పించుకునే తలనీలాల ప్రోగు కోసం ఈ వేలం పాటను నిర్వహించామన్నారు. సిద్దవటం గ్రామానికి చెందిన కూనా విజయభాస్కర్ రూ. 5.85 లక్షలకు దక్కించుకున్నారని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది స్వామి వారికి అదనంగా రూ. 8,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, పాటదారులు, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల జోలికొస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శనం, బాధితురాలు

మదనపల్లె : జీవనోపాధి కోసం దళితులు సాగుచేసుకుంటున్న భూములను అభివృద్ధి పేరుతో కాజేయాలని చూస్తే సహించేది లేదని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం హెచ్చరించారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో బాధిత దళిత మహిళతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె మండలం బసినికొండ గ్రామం సర్వేనంబర్.235/3లో 2.05 ఎకరాల భూమిని కొండామర్రిపల్లెకు చెందిన దళిత మహిళ రామాపురం వెంకటమ్మ భర్త నరసింహులు పేరుపై పట్టా, పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. ఇటీవల రెవెన్యూ సిబ్బంది మున్సిపల్ కార్యాలయానికి స్థలసేకరణలో భాగంగా సబ్‌డివిజన్ చేసేటప్పుడు 235/3కి బదులుగా 253/5లో 1.53 ఎకరాలు, 235/7లో 0.27 సెంట్లు భూమిగా మార్పుచేశారన్నారు. ఈ భూమికి సమీపంలో నేషనల్ హైవే పక్కన ఒకచోట ఏడుఎకరాలు, మరోచోట ఐదుఎకరాలు డీకేటీ భూమి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు మున్సిపల్ కార్యాలయానికి ఆ భూములను తీసుకోకుండా, కేవలం వెంకటమ్మకు చెందిన భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం తగదన్నారు. తక్షణమే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పేద దళిత మహిళ భూమికి సంబంధించి తదుపరి చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

బైకును ఢీకొన్న కారు

– విద్యార్థికి గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గంగనేరు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం కారు బైకును ఢీకొనడంతో వెంకటాద్రి అనే విద్యార్థికి తీవ్ర గాయాలైనట్లు మండల ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాచపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటాద్రి రాయచోటి పట్టణంలోని కళాశాలలో ఎమ్ఎల్‌టీ చదువుతున్నాడు. సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి బైకులో వస్తుండగా గంగనేరు క్రాస్ వద్ద కడప వైపు నుంచి రాయచోటి వెళ్తున్న కారు ఢీ కొంది. ఈ సంఘటనలో విద్యార్థి తలకు, కంటికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకుని గాయపడిన విద్యార్థిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు


గాయపడిన మహేష్

కలకడ : విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సచివాలయ ఉద్యోగిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కలకడ 108 సిబ్బంది యోగానందరెడ్డి, పైలెట్ శ్రీనివాసులు, పోలీసుల కథనం మేరకు.. కలకడ మండలం కె.దొడ్డిపల్లె సచివాలయంలో వెటర్నటీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వి.మండలం, ఈతమానువడ్డిపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వర కుమారుడు మహేష్ తన ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ మండలం కె.బాటవారిపల్లె పంచముఖ అంజనేయస్వామి ఆలయం సమీపంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన మహేష్‌ను 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోవా, కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం,వాహనం, నిందితులతో తాలూకా సీఐ శేఖర్

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో మండలంలోని రాష్ట్ర సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద కారుతో సహా గోవా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, కారు సీజ్ చేసినట్లు తాలూకా సీఐ ఎం.శేఖర్ తెలిపారు. మదనపల్లె పట్టణానికి చెందిన ధన కుమార్ (47), వెంకటపతి(36), అనే వ్యక్తులు 28 వేల రూపాయల విలువ చేసే 14.25 లీటర్ల గోవా మద్యం ఏపీ-03, బీసీ-9369 కారులో అక్రమంగా తరలిస్తుండగా, చెక్‌పోస్టు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు దొడ్డగల సంద్రకు చెందిన పి.చలపతి (35) ఏడు టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కేఎన్‌జీ. చేతన్ కుమార్ (27), కర్ణాటకకు చెందిన తొమ్మిది బీర్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి మొత్తం 31,482 రూపాయల విలువ గల గోవా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

12 లీటర్ల సారా సీజ్

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లె ఎస్టీ కాలనికి చెందిన రాజా భార్య రాణి సారా విక్రయిస్తుండటం గుర్తించి ఆమెను అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి ఆమె వద్ద నుంచి 12 లీటర్ల సారా సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం, నాటుసారా పట్టివేత

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం, నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..రామసముద్రం మండలం ఆల్వేపల్లె చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఈబీ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో మదనపల్లె మండలం దేవలంపల్లెకు చెందిన ముదిమడుగు వెంకటరమణ, మండ్యం వెంకటరమణలు టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంలో రూ.18,015 విలువచేసే ఐదుబాక్స్‌ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరు అక్రమంగా తరలించిన మద్యాన్ని విక్రయించే గోపాలకృష్ణపై కేసు నమోదుచేసి, ఇద్దరిని రిమాండ్‌కు పంపామని తెలిపారు. నిందితుడు గోపాలకృష్ణ పరారీలో ఉన్నాడని, త్వరలో అరెస్ట్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అలాగే మదనపల్లె మండలం కర్ణాటక సరిహద్దు చీకలబైలు వద్ద రాయచోటి డీటీఎఫ్, మదనపల్లె ఎస్ఈబీ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో రాయనచెరువు వడ్డిపల్లెకు చెందిన రవీంద్ర టీవీఎస్ స్కూటీలో ఏడుబాటిళ్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా, అరెస్ట్ చేశామన్నారు. మదనపల్లె డీఎఫ్‌టీ, టాస్క్‌ఫోర్స్ మొలకలదిన్నె వద్ద నిర్వహించిన తనిఖీల్లో రెడ్డెప్ప 47 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా, అరెస్ట్ చేసి సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.